సాక్షి
వైఎస్సార్ జిల్లా

శుక్రవారం । 20 । డిసెంబర్ । 2024



నేనేమి చేశాను నేరం..!

పొత్తిళ్లలో ఉండాల్సిన ఆ పసికందుకు ముళ్ల కంపే పడక పాన్పు అయింది. తల్లిదండ్రుల ప్రేమానురాగాల మధ్య పెరగాల్సిన ఆ చిన్నారి అనాథగా మారింది. -8లో



రిజిస్ట్రేషన్ చార్జీల పెంపే సంక్రాంతి కానుక

రిజిస్ట్రేషన్ చార్జీల పెంపును ప్రజలు సంక్రాంతి కానుకగా భావించాలా అని రాచమల్లు శివప్రసాదరెడ్డి ప్రశ్నించారు. -8లో

గరిష్టం/కనిష్టం
25.9 /22.6

వాతావరణం

జిల్లాలో గురువారం 22.6 - 25.9 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 0.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు పదోన్నతుల కౌన్సెలింగ్



కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి వైఎస్సార్ జిల్లా పరిధిలోని కడప మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలు, ప్రొద్దుటూరు మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్‌జీటీ, తత్సమాన కేటగిరీ ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతుల కోసం శుక్రవారం సర్టిఫికెట్ వెరిఫికేషన్, పదోన్నతుల కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తున్నట్లు డీఈఓ మీనాక్షి తెలిపారు. సంబంధిత సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌తోపాటు పదోన్నతుల కౌన్సెలింగ్‌కు హాజరయ్యే ఉపాధ్యాయులు ఉదయం 10 గంటలకు కడప డీఈఓ కార్యాలయానికి హాజరుకావాలని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ఆయా మున్సిపాలిటి పరిధిలోగల ప్రమోషన్, ఖాళీలు మరియు రోస్టర్ ఆధారంగా సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం అభ్యర్థుల జాబితాను www.kadapadeo.in వెబ్‌సైట్ పొందుపరచామని వివరించారు.

పనుల పరిశీలన

చింతకొమ్మదిన్నె: కేంద్రం పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 15వ ఆర్థిక సంఘం నిధులు వినియోగంపై పరిశీలన కోసం ఎన్‌స్పీఏఐఆర్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కో–ఆర్డినేటర్లు శ్రీకాంత్, రవికుమార్ చింతకొమ్మదిన్నె మండలంలోని చింతకొమ్మదిన్నె, కొలుములపల్లె,పాపాసాహెబ్ పేట, బుసిరెడ్డిపల్లె, పబ్బాపురం పంచాయతీలలో పర్యటించారు. ఈ సందర్భంగా తాగునీటి వసతులు, పారిశుధ్యం, రోడ్ల స్థితి తదితర అభివృద్ధి పనులను పరిశీలించారు. అలాగే పంచాయతీలకు ఉన్న సొంత ఆర్థిక వనరుల గురించి 16వ ఆర్థికసంఘం ద్వారా అవసరమయ్యే నిధులు, సలహాలు గురించి ఎంపీడీవో కుళ్లాయిబాబు, ఈఓపీఆర్‌డీ వెంకటసుబ్బారెడ్డి, పంచాయతీ కార్యదర్శులతో చర్చించిన్నట్లు ఈఓపీఆర్డి వెంకటసుబ్బారెడ్డి తెలిపారు.

ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా కందుల కొనుగోలు



కడప సెవెన్‌రోడ్స్: ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా జిల్లాలో ధరల స్థిరీకరణ నిధి కింద ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కందులు కొనుగోలు చేస్తామని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమ పంటను ప్రభుత్వానికి విక్రయించే ముందు వారికి సంబంధించిన రైతు సేవా కేంద్రాల్లో తమ పేర్లు నమోదు చేయించుకోవాలని చెప్పారు. ఈ–క్రాప్‌లో నమోదైన రైతుల నుంచి మాత్రమే కందులు కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని కంది పండించిన రైతులు ఉపయోగించుకోవాలని కోరారు.

నేడు 36 గ్రామాల్లో సదస్సులు

కడప సెవెన్‌రోడ్స్: భూ సమస్యల పరిష్కారానికి శుక్రవారం జిల్లాలోని 36 గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు డీఆర్వో విశ్వేశ్వర నాయుడు తెలిపారు. బద్వేలు రెవెన్యూ డివిజన్‌లో అంకన గొడుగునూరు, డి.నరసింహపురం, పుట్టాయపల్లి, కలువపల్లి, కొండపేట, అన్నలూరు, కవలకుంట్ల, పగడాలపల్లి, పులివెందుల రెవిన్యూ డివిజన్‌లోని కుప్పం, అంబకపల్లె, యర్రగుడిపల్లి, సుంకేసుల, సంతకొవ్వూరు, వేంపల్లె 3, 7 సచివాలయాలు, మీదిపెంట్ల, అయ్యవారిపల్లి, కీర్తిపల్లిలో సదస్సులు ఉంటాయని పేర్కొన్నారు. జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్‌లోని చియ్యపాడు, నేలటూరు, దానవులపాడు, కొండాపురం, మంగపట్నం, తొర్రివేముల, యస్.కొత్తపల్లి, నంగనూరుపల్లి, వెలవలి, ఇల్లూరు, కడప రెవెన్యూ డివిజన్‌లోని మాచనూరు, కొలుములపల్లె, ఉక్కాయపల్లె, టి.సదిపిరాళ్ల, రామచంద్రపురం, రావులపల్లి, కనుమొలపల్లి, మండపల్లి, తొప్పెట్ల గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరుగనున్నాయని డీఆర్వో వివరించారు.

నేటి నుంచి 'గుడ్ గవర్నెన్స్' క్యాంపెయిన్

కడప సెవెన్‌రోడ్స్: సమర్థవంతమైన పాలన, సేవలను ప్రజలకు అందించడమే గుడ్ గవర్నెన్స్ ప్రధాన ఉద్దేశ్యమని డీఆర్వో విశ్వేశ్వరనాయుడు పేర్కొన్నారు. గురువారం ఢిల్లీ నుంచి భారత ప్రభుత్వ పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం (డీపీఆర్‌పీజీ) కార్యదర్శి వి.శ్రీనివాస్ 'గుడ్ గవర్నెన్స్ వీక్' (జీజీడబ్ల్యూ) క్యాంపెయిన్‌ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి డీఆర్వోతో పాటు జెడ్పీ సీఈఓ ఓబులమ్మ, సీపీఓ హజరతయ్య, డీఐఓ డాక్టర్ విజయ్ కుమార్, డీఐపిఆర్వో వేణుగోపాల్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. వీసీ అనంతరం డీఆర్వో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేస్తున్న 'ప్రశాసన్ గావోన్ కి ఓర్– 2024' కార్యక్రమంలో భాగంగా.. దేశవ్యాప్తంగా ఈ నెల 19వ తేదీ నుంచి 24వ తేదీ వరకు జరిగే గుడ్ గవర్నెన్స్ వీక్ (జీజీడబ్ల్యూ) క్యాంపెయిన్ కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలన్నారు. ఈ నెల23న గుడ్ గవర్నెన్స్ ప్రాక్టీసుపై జిల్లాలో ఒక రోజు వర్క్ షాప్ ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వైద్య ఆరోగ్య శాఖకు అవినీతి జబ్బు!

జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో అవినీతి తారాస్థాయికి చేరింది. ఏకంగా మెరిట్ జాబితానే తారుమారు చేసే స్థాయికి దిగజారింది. ముఖ్యంగా కొందరు ఉద్యోగులు ముఠాగా ఏర్పడి బోగస్ సర్టిఫికెట్స్‌తో అనర్హులను అందలం ఎక్కిస్తున్న విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. లక్షలాది రూపాయలు చేతులు మారిన ఈ ఘటనతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ప్రకంపనలు మొదలయ్యాయి.

జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో.. బోగస్ సర్టిఫికెట్ల బాగోతం!
- మార్కుల జాబితాలో 'అంకెలు' తారుమారు
- పలువురికి అడ్డదారుల్లో ఉద్యోగాలు
- ఒక్కొక్కరి నుంచి లక్షలాది రూపాయలు వసూలు
- కార్యాలయ సిబ్బంది చేతివాటం
- అక్రమాలపై అధికారులకు ఫిర్యాదులు



జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం

సాక్షి టాస్క్‌ఫోర్స్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి అవినీతి జబ్బు పట్టుకుంది. బోగస్ సర్టిఫికెట్లతో ఉద్యోగాలనే తారుమారు చేశారని ఫిర్యాదులతో ఆ శాఖ ఒక్కసారిగా ఉలిక్కిపడింది. వైద్య ఆరోగ్యశాఖలో 2020లో వివిధ కేడర్‌లకు జరిగిన రిక్రూట్‌మెంట్‌లో 15 మందికి, 2023లో వైయస్సార్ కడప, అన్నమయ్య జిల్లాలకు జిల్లా క్షయ నియంత్రణ విభాగానికి చేపట్టిన నియామకాల్లో 9 మందికి బోగస్ సర్టిఫికెట్స్ ద్వారా ఉద్యోగాలు కల్పించిన విషయం వెలుగులోకి వచ్చింది.ఇందుకు సంబంధించిన రిక్రూట్‌మెంట్ ప్రక్రియను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పర్యవేక్షణలో నిర్వహించారు.

పక్కాగా చేశారిలా...

తొలుత ఉద్యోగాల కోసం దర ఖాస్తు చేసుకున్న అభ్యర్థుల మెరిట్‌ను పరిశీలిస్తారు. ఇందులో కొందరిని ఎంపిక చేసుకుని రాయ'బేరాలు'నడుపుతారు. ఒప్పందం కుదిరాక ఉద్యోగం ఇప్పించడానికి అడ్డదారుల్లో వెళ్తారు. తామనుకున్న అభ్యర్థులకు నిబంధనల ప్రకారం 'మెరిట్'ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటారు. అందుకోసం స్వయంగా బోగస్ సర్టిఫికెట్స్‌ను తయారు చేస్తారు. మార్కుల జాబితాలో ఎక్కువ మార్కులు ఉండేలా మార్కుల 'అంకెలు'ను మార్చేస్తారు. అంతేనా.. అభ్యర్థులు ఉద్యోగానికి సంబంధించిన కోర్సులు చదవనప్పటికీ.. బోగస్ సర్టిఫికెట్స్‌ను తయారుచేసి దరఖాస్తులో ఉంచుతారు. ఇలా సీరియల్ నెంబర్, హాల్ టికెట్ నెంబర్లతో సహా మార్పులు చేశారు. దీంతో అభ్యర్థులు ఉద్యోగాల ఎంపిక జాబితాలో మెరిట్ ఆధారంగా ఎంపికయ్యేలా చేశారు. తరువాత ఎంపికైన అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్స్‌ను వెరిఫికేషన్‌ను చేపట్టే సిబ్బంది కూడా తమ అనుచరులే కావడంతో సర్టిఫికెట్స్‌ను తూతూ మంత్రంగా పరిశీలించి, అంతా బాగున్నట్లు ఓకే చెప్పేస్తారు. దీంతో తామనుకున్న అనర్హులకు ఉద్యోగం వచ్చేలా చేశారు. ఇలా ఒక్కొక్కరి నుంచి రూ. 5 లక్షలకు పైగా వసూలు చేసినట్లు తెలిసింది..

ఆ సిబ్బంది నిర్వాకంతోనే...

జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కొంతమంది ఉద్యోగులపై ఎప్పటి నుంచో ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా వస్తున్న ఆరోపణ ల్లోనూ వారి పాత్రే ఉండడం గమనార్హం. అందులో ఒకరు వేరొక మండల కేంద్రంలో పనిచేయాల్సిన సీనియర్ అసిస్టెంట్, ఇక్కడే డిప్యుటేషన్‌పై విధులు చేపడుతున్నారు. మరొకరు కార్యాలయంలోనే సీనియర్ అసిస్టెంట్‌గా విధులను నిర్వహిస్తున్నారు. ఇంకొక వ్యక్తి గతంలో ఇక్కడే అవుట్ సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తూ, ప్రస్తుతం కడప రిమ్స్ జిల్లా క్షయ నియంత్రణ విభాగంలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా విధులను చేపడుతున్నారు. వీరితో పాటు మరికొందరి పాత్ర కూడా ఉన్నట్లుగా భావిస్తున్నారు. ఇందులో ఒక సీనియర్ అసిస్టెంట్ తమ కుటుంబ సభ్యులిద్దరికి బోగస్ సర్టిఫికెట్స్‌తోనే ఉద్యోగాలు ఇప్పించినట్లు సమాచారం. జిల్లా క్షయ నియంత్రణ విభాగంలో పనిచేస్తున్న మరొక ఉద్యోగి కూడా బోగస్ సర్టిఫికెట్స్‌తోనే ఉద్యోగం చేస్తున్నారు.

పరిశీలిస్తున్నాం



రెండు వారాల క్రితం ఇద్దరు ఉద్యోగులపై ఫిర్యాదులు వచ్చాయి. ఆ సర్టిఫికెట్స్ పరిశీలన కోసం యూనివర్శిటీకి పంపించాం. నేను విజయవాడలో ఉన్నందున పూర్తి వివరాలు తెలియలేదు. ఏవైనా ఉంటే పరిశీలిస్తాం.– డాక్టర్ రవిబాబు, అధికారి, క్షయ నియంత్రణ విభాగం

విచారణకు ఆదేశించాం



కొందరు ఉద్యోగులపై ఫిర్యాదులు వచ్చాయి. వారి సర్టిఫికెట్లను ఆయా యూనివర్సిటీలకు పంపించాం. వారిచ్చే నివేదిక ప్రకారం చర్యలు తీసుకుంటాం. దీనిపై విచారణకు ఆదేశించాం. – డాక్టర్ నాగరాజు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

ఆ వ్యక్తి ద్వారానే వాస్తవాలు వెలుగులోకి.....

ఎవరైతే బోగస్ సర్టిఫికెట్స్ ద్వారా ఉద్యోగం పొందారో అందులో ఓ వ్యక్తి ద్వారానే ఆ కార్యాలయంలో జరిగే బోగస్ భాగోతం వెలుగు చూడడం గమనార్హం .అతని పేరు రమేష్ (పేరు మార్చాం). ఇతను ఉద్యోగం కోసం యత్నించారు. ఈ నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో ఆధ్వర్యంలో కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని జిల్లా క్షయ నియంత్రణ యూనిట్‌లో ఆర్ఎన్ టీసీపీ ప్రోగ్రాం కింద (టీబీహెచ్‌వీ సూపర్‌వైజర్)గా పనిచేయడానికి దరఖాస్తు చేశాడు. నిజానికి ఇతను బీకాం పూర్తి చేశారు. ఈ క్రమంలో అక్కడ ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్‌తో (ప్రస్తుతం జిల్లా క్షయ నియంత్రణ విభాగంలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా విధులు చేపడుతున్నారు) పరిచయం ఏర్పడింది. ఆ ఆపరేటర్ ఖర్చు పెట్టుకుంటే ఉద్యోగం గ్యారెంటీగా వస్తుందని చెప్పారు. అందుకు రమేష్ ఒప్పుకున్నాడు. అనంతరం రమేష్‌ను ఆ ఉద్యోగి కార్యాలయంలో పనిచేస్తున్న ఆ ఇద్దరు సీనియర్ అసిస్టెంట్స్‌ను పరిచయం చేశారు. వారు రూ.5 లక్షలు అడిగినా.. చివరికి రూ.3 లక్షల బేరం కుదిరింది. ఈ క్రమంలో ఓ రోజు సదరు సీనియర్ అసిస్టెంట్స్ రూ.3 లక్షలు అడిగారు. రమేష్ అనుమానించి ఇవ్వలేదు. అది గమనించిన సీనియర్ అసిస్టెంట్స్ 'మెరిట్ లిస్ట్‌లో నీ పేరుంటేనే డబ్బులివ్వు'అని చెప్పి వెళ్లిపోయాడు. కొద్ది రోజుల తరువాత మెరిట్ జాబితా.. ఆపై ఫైనల్ జాబితాలో కూడా పేరు ఉండడంతో రమేష్ ఉద్యోగంలో చేరాడు. అనంతరం ఒప్పందం ప్రకారం రూ. 3 లక్షలకు గాను రూ.2 లక్షలు సమర్పించుకున్నారు. కొద్ది రోజులకు మిగతా లక్ష ఇవ్వాలని రమేష్‌పై సీనియర్ అసిస్టెంట్స్ ఒత్తిడి చేశారు. ఇప్పటికే రూ.2 లక్షలు అప్పు చేసి ఇచ్చిన రమేష్, మిగతా లక్షను సమకూర్చలేకపోయారు. ఇక డబ్బులు మీకివ్వలేనని ప్రాధేయ పడినా వారు ఒప్పుకోలేదు. దీంతో ఆ ఇద్దరిలో ఒక సీనియర్ అసిస్టెంట్ వేరొకరి చేత రమేష్ బోగస్ సర్టిఫికెట్స్‌తో ఉద్యోగం పొందినట్లుగా, సమాచారం కావాలని సమాచార హక్కు చట్టం ద్వారా అడిగారు. దీంతో భయపడిన రమేష్ ఇటీవల ఉద్యోగానికి రాజీనామా చేశారు.

అవినీతిపై ఫిర్యాదులు...



తనకు జరిగిన అన్యాయం మరొకరికి జరగకూడదని భావించిన రమేష్ అక్కడ జరుగుతున్న అక్రమాలను కళ్లారా చూసిన ఆయన పూసగుచ్చినట్లుగా ఎస్పీతో పాటు జిల్లా, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అంతేగాక తన ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ నేపథ్యంలోనే 'లంచం ఇవ్వడం కూడా నేరమే' అని రమేష్‌ను కొందరు బెదిరించినట్లుగా సమాచారం. ఈ అంశానికి సంబంధించి మొత్తం 23 మంది ఉద్యోగులకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నోటీసులు ఇచ్చినట్లు తెలుస్తోంది. అదే సందర్భంలో పై స్థాయి అధికారులు విచారణకు రాకముందే జిల్లా స్థాయిలోనే డీఎంహెచ్‌ఓ పరిధిలోనే విచారణ జరిపించాలనే ఆలోచనలో ఉన్నట్లుగా సమాచారం. ఒక్క రమేషే కాదు చాలా మంది అనర్హులు ఉద్యోగాలు చేస్తున్నారని... వాస్తవాలు వెలుగులోకి రావాలంటే నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని పలువురు కోరుతున్నారు. కాగా ఎప్పటినుంచో జిల్లా వైద్యశాఖ కార్యాలయం తీరుపై ఆరోపణలు, విమర్శలు వస్తూనే ఉన్నాయి. తాజాగా అవి బట్టబయలవడంతో జిల్లా ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో చూడాలి.

ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి



డ్రం సీడర్ పద్ధతి ద్వారా వరిసాగును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు

అట్లూరు: రోజు రోజుకు ప్రకృతి వ్యవసాయంపై రైతులు ఆసక్తి చూపిస్తున్నారని జిల్లా వ్యవసాయ అధికారి ఎ.నాగేశ్వర రావు పేర్కొన్నారు. బద్వేలు మండలం అబ్బూసాహెబ్‌పేట గ్రామంలో ఆదర్శ రైతు గోగుల రాధాకృష్ణయ్య ప్రకృతి వ్యవసాయం పద్ధతి .. డ్రం సీడర్ ద్వారా చేస్తున్న వరి సాగును గురువారం ఆయనతో పాటు స్థానిక వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజ, బిజివేముల వీరారెడ్డి అగ్రికల్చర్ కళాశాల మొదటి సంవత్సరపు విద్యార్థులతో పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు రాధాకృష్ణయ్య పృకృతి వ్యవసాయం ద్వారా సాగు చేస్తున్న వరి రకాలు నవరా, కాలాబట్టి, కులకర్, పుంగార్, బహురూపి, కూజీ పటాలియా, రత్నశాలి ఈ 7 రకాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 257 గ్రామాలలో 36 వేల మంది రైతులు 48 వేల ఎకరాలలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంబిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజరు ఎస్. ప్రవీణ్ కుమార్, బద్వేలు వ్యవసాయ అధికారి కె.చంద్రమోహన్‌రెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మరియూ రైతులు పాల్గొన్నారు.

మదనపల్లె ఫైళ్ల దగ్ధం కేసులో సీఐడీ పోలీసుల విచారణ

గుర్రంకొండ: మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దగ్ధమైన కేసులో సీఐడీ పోలీసులు మండలంలోని తరిగొండ గ్రామంలో గురువారం నెల్లూరు సీఐడీ సీఐ రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలోని పోలీసు అధికారుల బృందం 20 మంది విచారణ జరిపారు. మదనపల్లెకు చెందిన ఓ రిటైర్డ్ పోస్టల్ అధికారిని కూడా విచారించారు.విచారణలో సదరు అధికారి మండలంలోని తరిగొండ, శెట్టివారిపల్లె గ్రామాల్లో పలువురు రైతుల దగ్గర భూములు కొనుగోలు చేసినట్లు వెలుగుచూసింది. ఈనేపథ్యంలో సీఐడీ పోలీసులు మొత్తం 20 మంది రైతులను పూర్తి స్థాయిలో విచారించారు. రైతుల దగ్గర కొనుగోలు చేసిన భూములు రైత్వారీపట్టావా లేక ప్రభుత్వ భూములా అని ఆరా తీశారు. రైతులందరూ సదరు రిటైర్డ్ పోస్టర్ అధికారికి మనస్ఫూర్తిగా విక్రయించారా లేక దౌర్జన్యంగా రాయించుకొన్నారా అన్న అంశాలపై విచారణ జరిపి రైతుల దగ్గర రికార్డులు, స్టేట్‌మెంట్లు తీసుకొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

అడిషినల్ సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూష కుమారి

కడప ఎడ్యుకేషన్: క్రీడలతో విద్యార్థినులకు మానసికోల్లాసం కలుగుతుందని కడప అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కె. ప్రత్యేష కుమారి పేర్కొన్నారు. కడప నగర శివార్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం 27వ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 2024–25 వేడుకలు ప్రిన్సిపాల్ సీహెచ్ జ్యోతి అధ్యక్షతన అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కె. ప్రత్యూష కుమారి, పాలిటెక్నిక్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ నిర్మల్‌కుమార్ ప్రియా హాజరయ్యారు. వీరు తొలుత జాతీయ జెండాను ఆవిష్కరించి తదుపరి క్రీడా జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలకు ఉమ్మడి కడపజిల్లాలోని 13 పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన సుమారు 200 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో విద్యార్థినిలు ఉత్సాహభరితంగా పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కె. ప్రత్యూష కుమారి

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల జిల్లా అధ్యక్షుల నియామకం



జీవీ రాఘవ రెడ్డి
గ్రీవెన్స్ సెల్



దేవిరెడ్డి ఆదిత్య
యువజన విభాగం



మేసా ప్రసాద్
ఎంప్లాయిస్ వింగ్



ఎం. జాషువా
వైఎస్సార్ టీయూసీ



వేణుగోపాల్ నాయక్
ఎస్టీ విభాగం

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షునిగా ఎస్.వెంకటేశ్వర్లు, వలంటీర్ల విభాగం అధ్యక్షునిగా ఎన్.శ్రీకాంత్‌రెడ్డి, ప్రచార విభాగం అధ్యక్షుడిగా షేక్ మహబూబ్‌బాషా (బద్వేలు నియోజకవర్గం), మున్సిపల్ విభాగం అధ్యక్షుడిగా వి.హృషికేశవరెడ్డి, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా ఎస్.శివసుబ్రమణ్యం (జమ్మలమడుగు నియోజకవర్గం), క్రిస్టియన్ మైనార్టీ విభాగం అధ్యక్షునిగా బి.షడ్రక్ రాజు, యువజన విభాగం అధ్యక్షుడిగా దేవిరెడ్డి ఆదిత్య, మహిళా విభాగం అధ్యక్షురాలిగా టీపీ వెంకట సుబ్బమ్మ, ఎస్టీ విభాగం అధ్యక్షునిగా బి.వేణుగోపాల్ నాయక్, విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా పి.గురుసాయిదత్త, ఆర్టీఐ విభాగం అధ్యక్షుడిగా వి.రామకృష్ణారెడ్డి, గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడిగా జీవీ రాఘవరెడ్డి, వైఎస్సార్ టీయూసీ అధ్యక్షునిగా ఎం.జాషువ, లీగల్ సెల్ అధ్యక్షునిగా ఎం.నాగిరెడ్డి, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా ఎస్‌కే అహ్మద్‌బాషా, డాక్టర్ల విభాగం అధ్యక్షునిగా ఎస్.నాగార్జునరెడ్డి, ఇంటలెక్చువల్స్ ఫోరం అధ్యక్షుడిగా పి.సంపత్‌కుమార్, ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్స్ వింగ్ అధ్యక్షుడిగా మేసా ప్రసాద్ (కడప నియోజకవర్గం), రైతు విభాగం అధ్యక్షునిగా పుత్తా శివప్రసాద్‌రెడ్డి, బూత్ కమిటీల అధ్యక్షునిగా ఎస్.చెన్నకేశవరెడ్డి (కమలాపురం నియోజకవర్గం), బీసీ విభాగం అధ్యక్షునిగా ఎం.శివరామకృష్ణ, మైనార్టీ సెల్ అధ్యక్షునిగా షేక్ మదీన దస్తగిరి, కల్చరల్ విభాగం అధ్యక్షునిగా కె.గుర్రప్ప (మైదుకూరు), పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షునిగా కల్లూరు నాగేంద్రారెడ్డి, చేనేత విభాగం అధ్యక్షునిగా బి.సూర్యనారాయణ, అంగన్వాడీ విభాగం అధ్యక్షురాలిగా కె.సునంద (ప్రొద్దుటూరు), సోషల్ మీడియా విభాగం అధ్యక్షునిగా ఎన్.వివేకానందరెడ్డి, ఐటీ విభాగం అధ్యక్షునిగా ఎ.కుమారస్వామిరెడ్డి (పులివెందుల)లను నియమించారు.

ఆధిపత్యం కోసం బ్రదర్స్ ఆరాటం!

- పోట్లదుర్తిలో పెద్దమ్మ తల్లి దేవాలయం స్వాధీనంలోకి తెచ్చుకునేందుకు తంటాలు
- ఆలయానికి కాంపౌండ్ వాల్... అక్కడే జిమ్ ఏర్పాటుకు సన్నాహాలు
- ఎంపీ గ్రాంట్ నుంచి నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు

సాక్షి ప్రతినిధి, కడప: పోట్లదుర్తి గ్రామంలో ఆధిపత్యం కోసం ఆ ఇద్దరు బ్రదర్స్ ఆరాటపడుతోన్నారు. నయానో భయానో పైచేయి సాధించాలనే దిశగా అడుగులు వేస్తున్నారు. ఇదివరకూ మోడల్ స్కూల్ పేరిట, లిక్కర్ ఫ్యాక్టరీ పేరిట పేదల భూములు బలవంతంగా 80 ఎకరాలు స్వాధీనం చేసుకున్నారు. ఈమారు పెద్దమ్మ తల్లి దేవాలయం ఆధీనంలోకి తెచ్చుకోవడానికి వడివడిగా అడుగులు వేస్తున్నారు. గ్రామస్థులు అభ్యంతరం చెప్పినా పెడచెవిన పెడుతూ ఏకపక్ష చర్యలకు సన్నద్ధులయ్యారు. వివరాల్లోకి వెళితే.. పోట్లదుర్తి గ్రామంలో సర్వే నంబర్ 657లో 3.09 ఎకరాలు పెద్దమ్మ తల్లి పేరిట ప్రభుత్వ భూమి ఉంది. రెవెన్యూ రికార్డులు ఆ విషయాన్ని ఇప్పటికీ స్పష్టం చేస్తున్నాయి. అందులోనే పెద్దమ్మ తల్లి దేవాలయం కూడా ఉంది. కాగా అక్కడ అభివృద్ధి పేరిట ఆలయ భూమిలో తిష్ట వేసేందుకు 'పోట్లదుర్తి బ్రదర్స్' సన్నాహాలు ఆరంభించారు. ఎంపీ గ్రాంటు నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు ద్వారా పైచేయి సాధించేందుకు కుయుక్తులు ప్రదర్శిస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే గ్రామస్తులు తహశీల్దార్ నుంచి కలెక్టర్ వరకూ అభ్యంతరం చెబుతూ ఫిర్యాదు చేశారు. ఉన్న స్థలాన్ని ఆలయం కోసం కొనసాగించాలని కోరుతున్నారు. ఇప్పటికే కొంత భూమి అన్యాక్రాంతమైందని, ఉన్న ఆల య భూమిలో జిమ్, పార్కులాంటివి ఏర్పాటు చేస్తే, జాతర నిర్వహణ కష్టత రమని గ్రామస్తులు అభ్యంతరాలు తెలిపారు. అధికారులు సైతం పోట్లదుర్తి బ్రదర్స్ ఆలోచనలకు అనుగుణంగా అడుగులు వేస్తున్నా రని పలువురు వాపోతున్నారు.



రూ.96లక్షలు ఎంపీ గ్రాంటు విడుదల...

పెద్దమ్మ తల్లి దేవాలయానికి కాంపౌండ్‌వాల్ తోపాటు ఆలయ భూమిలో జిమ్, పార్కు ఏర్పాటు చేసేందుకు ఎంపీ రమేష్‌నాయుడు (రాజ్యసభ సభ్యుడుగా ఉన్నప్పటి గ్రాంటు) నిధుల నుంచి రూ.96లక్షలు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆ విషయాన్ని తెలుసుకున్న గ్రామస్తులు తహసీల్దార్‌తో మొదలు పెట్టి జిల్లా కలెక్టర్ వరకూ ఫిర్యాదు చేశారు. జాతర సమయంలో దాదాపు 2వేల మంది ఆలయ ప్రాంగణానికి వస్తారని... ఇక్కడ నిర్మాణాలు చేపడితే ఇరుకైపోతుందని పేర్కొన్నారు. గ్రామస్థుల అభ్యర్థనలను పట్టించుకునే స్థితిలో జిల్లా యంత్రాంగం లేదని సమాచారం. ఆ మేరకు జిమ్, పార్కు ఏ ర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.

ఇదివరకూ ఎకరాలు స్వాధీనం

టీడీపీ ప్రభుత్వ (2014–19) హయాంలో పోట్లదుర్తి గ్రామంలో మోడల్ స్కూల్ ఏర్పాటు ఇదివరకూ రమేష్‌నాయుడు కుటుంబ సభ్యులు 30ఎకరాలు స్వాధీనం చేసుకున్నారు. అరకొరగా ఉన్న భూములు ఇచ్చేందుకు రైతులు అనాసక్తి చూపినా అధికార హోదా చూపెట్టి ఎకరా రూ.11లక్షలతో 30 ఎకరాలు ఆధీనంలోకి తెచ్చుకున్నారు. అలాగే లిక్కర్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయనున్నట్లు గ్రామస్తులకు బూచిగా చూపెట్టి ఎకరం రూ.7 లక్షలతో 50 ఎకరాలు తీసుకున్నారు. గ్రామస్థులు ఉన్న భూములు ఇచ్చేందుకు ఆసక్తి చూపకపోయినా అధికార బెత్తం చేతిలో పెట్టుకొని 80 ఎకరాలు స్వాధీనం చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కాగా ఇప్పటికీ పోట్లదుర్తి గ్రామంలో మోడల్ స్కూల్ రాలేదు, లిక్కర్ ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టలేదు. ప్రస్తుతం పెద్దమ్మ తల్లి ఆలయం ప్రాంగణంపై రమేష్‌నాయుడు కుటుంబ సభ్యుల దృష్టి పడిందని గ్రామస్థులు వాపోతున్నారు. పెద్దమ్మ తల్లి ఆలయం నిర్వాహణ ఆధీనంలోకి తీసుకోవాలనే తలంపే అధికంగా ఉన్నట్లు పలువురు చెప్పుకొస్తుండడం గమనార్హం.

మాధవరంలో కేంద్ర బృందం పర్యటన



చేనేత కార్మికుల మగ్గాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం

ఒంటిమిట్ట: వైఎస్సార్ జిల్లా సిద్దవటం మండలం మాధవరం వన్‌లో గురువారం కేంద్ర చేనేత, జౌళిశాఖ అధికారులు సృష్టి, జాస్మిన్ పర్యటించారు. ఇక్కడ నేసిన పట్టువస్త్రాలను వేరే ప్రాంత్రాల వస్త్రాలుగా అమ్ముడు పోతుండటంతో వీటికి గుర్తింపు ఇవ్వాలని గతంలో నాబార్డ్ చేసిన సిఫారస్సు చేసింది. ఈ మేరకు ఢిల్లీ నుంచి అధికారుల బృందం సిద్దవటం మండలంలో పర్యటించింది. ఈసందర్భంగా అధికారులు సృష్టి, జాస్మిన్ మాధవరం సమీపంలోని ఎస్‌కేఆర్ నగర్ లో గల చేనేత కార్మికుల గృహాల్లోని మగ్గాలను, నేత వేసిన పట్టు వస్త్రాలను పరిశీలించారు.వస్త్రాల తయారీకి ఎలాంటి ముడిసరుకులు వాడుతున్నారని చేనేత కార్మికులను అడిగి తెలుసుకున్నారు. డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్, హ్యాండ్ లూమ్స్ ఏడీ పిచ్చేశ్వరరావు ఉన్నారు.

- అంతకుముందు కేంద్ర చేనేత, జౌళి శాఖ అధికారులు ఒంటిమిట్ట శ్రీ కోదండరామయ్యను దర్శించుకున్నారు. అర్చకులు వీరికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

క్లుప్తంగా

బోటు మోటారు మాయం!



బోటుకు ఉన్న మోటారు మాయమైన దృశ్యం

జమ్మలమడుగు : పర్యాటక కేంద్రమైన మైలవరం జలాశయంలో ఇటీవల కాలంలో టూరిస్టులను ఆకర్షించే విధంగా బోటింగ్ ఏర్పాటు చేశారు. అయితే ఎలాంటి అనుమతులు లేకుండా కొంత మంది ప్రైవేట్ బోట్లను ఏర్పాటు చేసి పర్యాటకులనుంచి దోపిడీకి తెర లేపారు. దీంతో టూరిజం అధికారులు బోటు నడుపుకునేందుకు ఎలాంటి అనుమతులు లేవని బోటును స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న బోటు మోటార్‌ను దప్పెర్ల టూరిజం హోటల్ వద్ద ఏర్పాటు చేసిన బోటు షికారు ప్రాంతంలో నిలిపారు. ప్రస్తుతం బోటుకు ఉన్న ఐదు లక్షల రూపాయల విలువ గల మోటారును గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. టూరిజంశాఖ పరిధిలో ఉన్న బోటు మోటారు మాయం కావడం.. టూరిజం అధికారులు సైతం దీని గురించి పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

హఠాత్తుగా మహిళా కూలీ మృతి



మృతి చెందిన మహిళా కూలీ

వల్లూరు : మండల పరిధిలోని పెద్దపుత్త గ్రామ పొలాల్లో గురువారం పొలం పని చేస్తూ మహిళా కూలీ రామక్క హఠాత్తుగా మృతి చెందింది. తోటి కూలీలు తెలిపిన వివరాల మేరకు ప్రొద్దుటూరు మండల పరిధిలోని సీతంపల్లెకు చెందిన ఒక రైతు పెద్దపుత్త గ్రామ పొలాల్లో భూమిని కౌలుకు తీసుకుని దోస తోట సాగు చేశాడు. అందులో కలుపు తీసేందుకు అతని గ్రామం నుంచి సుమారు 30 మంది కూలీలను ఆటోల్లో తీసుకుని వచ్చాడు. ఉదయం నుంచి వారు పొలంలో కలుపు తీత పనులు చేస్తున్నారు. కూలీల్లో ఒకరైన రామక్క మధ్యాహ్నం సుమారు 3-30 గంటల సమయంలో ఉన్నట్లుండి కుప్ప కూలి స్పృహ తప్పి కిందకు ఒరిగింది. తోటి కూలీలు ఆమెకు సపర్యలు చేస్తూ , 108 వాహనానికి ఫోన్ చేశారు. వారు వచ్చి పరీక్షించి ఆమె అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆత్మహత్య

కర్నూలు : కర్నూలు నగరానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి సురేష్ బాబు (35) ఆత్మహత్య చేసుకున్నాడు. వైఎస్సార్ జిల్లా పులివెందుల పట్టణానికి చెందిన ఇతను పదేళ్లుగా కర్నూలులోని గణేష్ నగర్‌లో నివాసముంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. గురువారం ఉదయం కృష్ణానగర్ సమీపంలో డోన్ వైపు వెళ్తున్న గూడ్స్ కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కో పైలట్ సతీష్ ఇచ్చిన సమాచారం మేరకు కర్నూలు రైల్వే పీఎస్ ఎస్ఐ కిరణ్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతుడి వివరాలు తెలుసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కర్నూలు ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించారు. అయితే ఆత్మహత్యకు గల కారణాలపై కుటుంబ సభ్యులను విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రొద్దుటూరు నగర వనానికి ఏమైంది.?

- నేషనల్ పార్కులో నగరవనం ఏర్పాటు చేయడంపై ప్రభుత్వం అభ్యంతరం
- ప్రొద్దుటూరులో ఆగిన నగర వనం పార్కు పనులు
- జిల్లాలోని జమ్మలమడుగు, బద్వేల్‌లో 60 శాతం వరకు పూర్తి
- నేషనల్ పార్కులోని 47 హెక్టార్ల టూరిజం జోన్‌లో నగరవనం ఏర్పాటుకు ప్రభుత్వ అనుమతి కోరిన అటవీ అధికారులు



నగరవనం ఏర్పాటు చేయనున్న రాజీవ్‌గాంధీ నేషనల్ పార్కు

ప్రొద్దుటూరు క్రైం : పచ్చని చెట్ల మధ్య పచ్చిక భూముల్లో సేదదీరడం అనేది అద్భుతమైన అనుభూతి. సమయం దొరికినప్పుడల్లా ఇలాంటి ప్రదేశాల్లో గడపాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. ఇందుకోసం సంపన్నులు సుదూర ప్రాంతాలకు వెళ్తే.. పేద, మధ్య తరగతి ప్రజలు మాత్రం తమ చుట్టుపక్కల ఉన్న పార్కులు, ఇతర టూరిజం ప్రదేశాలకు వెళ్తుంటారు. పండుగలు, సెలవు దినాల్లో కుటుంబ సమేతంగా ఉల్లాసంగా గడపడానికి పట్టణాల్లో సరైన సందర్శన ప్రాంతాలు లేవనే చెప్పవచ్చు. పురపాలక పార్కులు ఉన్నా అందులో సరైన వసతులు లేని కారణంగా ప్రజలు అక్కడికి వెళ్లేందుకు ఉత్సాహం చూపరు. ఆర్థిక భారం కారణంగా మధ్య తరగతి వర్గాలు దూర ప్రాంతాలకు వెళ్లేందుకు ఇష్టపడరు. పట్టణ శివారులోని ఎర్రగుంట్ల రోడ్డులో ఉన్న అటవీ భూమిలో 2006లో నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చొరవతో రాజీవ్‌గాంధీ నేషనల్ పార్కును ఏర్పాటు చేశారు. సుమారు 239 హెక్టార్లలో పార్కును అభివృద్ధి చేశారు. పట్టణ వాసులు, పరిసర గ్రామాల ప్రజలు పండుగలు, వారాంతపు రోజుల్లో పట్టణంలోని మున్సిపల్ పార్కుతో పాటు రాజీవ్‌గాంధీ నేషనల్ పార్కుకు వెళ్లి అక్కడ సాయంత్రం వరకు గడిపి వస్తారు. అయితే ప్రజలకు మరింత ఆహ్లాదకర వాతావరణంలో ఉల్లాసంగా గడిపేందుకు 2022లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా నగరవనాల పేరుతో కొత్త పార్కులను మంజూరు చేసింది. ఇందులో భాగంగా జిల్లాలో ప్రొద్దుటూరుతో పాటు జమ్మలమడుగు, బద్వేల్ ప్రాంతాల్లో నగరవనం పార్కులు మంజూరయ్యాయి. ఇందుకోసం ప్రొద్దుటూరులోని ఎర్రగుంట్ల రోడ్డులో ఉన్న రాజీవ్‌గాంధీ నేషనల్ పార్కు ఎదురుగా 30 హెక్టార్లకు పైగా ఉన్న రామేశ్వరం రిజర్వ్ ఫారెస్ట్ స్థలంలో నగరవనం ఏర్పాటు చేస్తున్నట్లు అప్పట్లో అటవీశాఖ అధికారులు ప్రకటించారు. ఈ మేరకు అటవీ, రెవెన్యూ అధికారులు కలిసి సర్వే నిర్వహించి నగరవనం నిర్మాణ స్థల గుర్తింపు ప్రక్రియను పూర్తి చేశారు. ఫారెస్ట్ స్థలంలోని జంగిల్ క్లియరెన్స్ పనులు కూడా పూర్తి చేశారు. కొంత కాలం తర్వాత ఈ స్థలంపై అభ్యంతరాలు వస్తున్నాయంటూ అటవీశాఖ అధికారులు పనులను ఆపేశారు. దీంతో అటవీశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నగరవనం ప్రాజెక్టును నేషనల్ పార్కులోకి మార్చారు. ఇక్కడి నేషనల్ పార్కులో పనులను ప్రారంభించి సుమారు రూ. 9 లక్షలు మేర ఖర్చు చేశారు. తర్వాత ఏం జరిగిందో గానీ.. నేషనల్ పార్కులో నగరవనం ఎలా ఏర్పాటు చేస్తారంటూ ప్రభుత్వం అభ్యంతరం చెప్పింది. దీంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన అధికారులు

రాజీవ్‌గాంధీ నేషనల్ పార్కులో సుమారు 47.7 హెక్టార్లలో నగరవనం ఏర్పాటు చేయనున్నారు. అటవీ నిబంధనల ప్రకారం నేషనల్ పార్కులో సందర్శకులకు అనుమతి లేదు. ఈ కారణం చేత ఇక్కడ నగరవనం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అభ్యంతరం చెప్పినట్లు అధికారులు చెబుతున్నారు. రాజీవ్ గాంధీ నేషనల్ పార్కు పూర్తి విస్తీర్ణం 239 హెక్టార్లు. ఇందులో కేవలం 47.7 హెక్టార్ల మేర ఉన్న టూరిజం జోన్‌లో మాత్రమే నగరవనం ఏర్పాటు చేస్తున్నామని అటవీశాఖ అధికారులు ప్రభుత్వానికి వివరణ ఇచ్చుకున్నారు. పనులు ప్రారంభించేందుకు అనుమతి ఇవ్వాలంటూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఈ ప్రాజెక్టు కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ. 1.20 కోట్లు మంజూరు చేసింది. పనులు ప్రారంభించేందుకు రూ. 84 లక్షలు నిధులు కూడా విడుదల చేసింది. ఫెన్సింగ్, తదితర పనుల కోసం రూ. 9 లక్షలు ఖర్చు కాగా రూ. 73 లక్షలు సంబంధిత అధికారి అకౌంట్‌లో ఉన్నాయి. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే పనులను ప్రారంభిస్తామని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. జమ్మలమడుగు సమీపంలోని పొన్నతోట, బద్వేల్‌లో నగరవనం పార్కుల పనులు 60 శాతంపైగా పూర్తయ్యాయి. ప్రొద్దుటూరులో మాత్రం ప్రాజెక్టు పనులు ఆగిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పాటు స్వచ్ఛంద సహకార సంస్థలు, ఔత్సాహికుల సహకారంతో నగరవనం పార్కులను అభివృద్ధి చేయనున్నారు. ఇందులో చిల్డ్రన్‌పార్కు, ఓపెన్ జిమ్, టాయిలెట్స్, ఆర్నమెంటల్ ప్లాంట్స్, క్యాంటీన్ అభివృద్ధి, గార్డెనింగ్ తదితర అభివృద్ధి పనులు చేయనున్నారు. కాగా ఇటీవల కమలాపురానికి కొత్తగా నగరవనం ప్రాజెక్టు మంజూరు చేసినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. కమలాపురంలోని చెప్పలిరోడ్డులో నగరవనం పార్కు ఏర్పాటు చేయనున్నారు. స్థల పరిశీలన, హద్దుల గుర్తింపు అనంతరం పనులను ప్రారంభిస్తారు.

> **ప్రభుత్వ అనుమతి రాగానే పనులను ప్రారంభిస్తాం**
> రాజీవ్‌గాంధీ నేషనల్ పార్కులో నగరవనం ప్రాజెక్టు పనులను చేపట్టేందుకు ప్రభుత్వ అనుమతి కోసం ఫైల్ పంపించాం. అనుమతి రాగానే పనులను ప్రారంభిస్తాం. నేషనల్ పార్కులోని 47 హెక్టార్ల టూరిజం జోన్‌లో నగరవనం పార్కు ఏర్పాటు చేయనున్నాం. నేషనల్ పార్కు ఎదురుగా ఉన్న అటవీ స్థలంలో పార్కింగ్ ఏర్పాటు చేస్తాం.
> **- హేమాంజలి, ఎఫ్ఆర్ఓ, ప్రొద్దుటూరు**

వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం

కాపర్ వైరు చోరీ



పొలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసిన దుండగులు

లింగాల : లింగాల మండలం వెలిదండ్ల గ్రామంలో బుధవారం రాత్రి వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను దుండగులు ధ్వంసం చేసి కాపర్ వైరును అపహరించారు. విద్యుత్ ఏఈ బాలసంజీవులు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వెలిదండ్ల గ్రామానికి చెందిన జి.బాలన్న, జి.రామచంద్రారెడ్డి, సుధాకర్‌రెడ్డి, శకుంతల, రంగన్న అనే రైతులకు చెందిన నాలుగు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను దుండగులు ధ్వంసం చేసి వాటిలోని కాపర్ వైరును అపహరించుకుపోయారు. పులివెందుల – పార్నపల్లె ప్రధాన రహదారిలో ఉన్న బాట గంగమ్మ ఆలయ సమీపంలోని పొలంలో ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేశారు. ఈ మేరకు లింగాల పోలీసులకు రైతులతో కలిసి విద్యుత్ ఏఈ ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్ఐ మధుసూదనరావు స్పందిస్తూ తరచూ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురవుతున్నాయని, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి దుండగలను పట్టుకుంటామన్నారు.

రిజిస్ట్రేషన్ చార్జీల పెంపే సంక్రాంతి కానుక

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : రిజిస్ట్రేషన్ చార్జీల పెంపును ప్రజలు సంక్రాంతి కానుకగా భావించాలా అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ప్రశ్నించారు. గురువారం ప్రొద్దుటూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంపద సృష్టిస్తా అని ఎన్నికల సందర్భంగా గొప్పలు చెప్పిన చంద్రబాబు గడిచిన ఆరు నెలల్లో ఏయే సంపద సృష్టించారో చెప్పాలన్నారు. అన్నింటా ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. 2025 జనవరి 1వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ చార్జీలను దాదాపు రెండింతలు పెంచేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందన్నారు. అధికారంలోకి వచ్చిన ఒకటి రెండు నెలలు మాత్రమే సీఎం చంద్రబాబు ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీన వేతనాలు మంజూరు చేశారని, తర్వాత ఏ తేదీన ఇస్తున్నారో ఎవరికి అర్థం కావడం లేదన్నారు. ఉద్యోగులకు, పెన్షనర్లకు రావాల్సిన బకాయిలను చెల్లించలేదని, ఉద్యోగ సంఘాలు తమ సమస్యల పరిష్కారం కోసం అప్పుడే రోడ్డు ఎక్కే పరిస్థితి వచ్చిందన్నారు. వలంటీర్ల వేతనాన్ని రూ.10వేలు పెంచుతామని చెప్పి ఇప్పుడు మాట తప్పారన్నారు. నేతన్న నేస్తం ఏమైందని అడిగారు. ఇప్పటికే ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కొత్త పింఛన్లు ఇవ్వాల్సింది పోయి ఉన్న పింఛన్లు తొలగించడం న్యాయమా అని నిలదీశారు.

రేషన్ కార్డుల ఊసే లేదు

వివిధ కారణాల వల్ల అర్హత ఉన్న పేదలు సంక్షేమ పథకాలను అందుకోలేకపోతున్నారని రాచమల్లు తెలిపారు. ఇందుకోసం రేషన్ కార్డులో మార్పులు, చేర్పులు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారని పేర్కొన్నారు. కొత్తవి మంజూరు చేయకపోవడం వల్ల అర్హత ఉన్న దివ్యాంగులు, వితంతువులు, వృద్ధులు, మంచానికే పరిమితమైన వారు కొత్త పింఛన్లు అందుకోలేక పోతున్నారన్నారు. చంద్రబాబును నమ్మి అన్ని వర్గాల ప్రజలు మరో మారు మోసపోయారని తెలిపారు. సమావేశంలో కౌన్సిలర్లు వరికూటి ఓబుళరెడ్డి, భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, గరిశపాటి లక్ష్మీదేవి, గుర్రం లావణ్య, కోఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షురాలు గజ్జల కళావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు బీఎస్ఆర్, చౌడం రవి, టంగుటూరు గౌతం రెడ్డి, పార్వతి పాల్గొన్నారు.

నేనేమి చేశాను నేరం..!



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నవజాత శిశువు

జమ్మలమడుగు : పొత్తిళ్లలో ఉండాల్సిన ఆ పసి కందుకు ముళ్ల కంపే పడక పాన్పు అయింది. తల్లిదండ్రుల ప్రేమానురాగాల మధ్య అల్లారుముద్దుగా పెరగాల్సిన ఆ చిన్నారి అనాథగా మారి విలవిల్లాడాల్సి వచ్చింది. నవ మాసాలు మోసి కన్న తల్లి జాడ లేదు. అబ్బురంగా చూసుకోవాల్సిన తండ్రి ఊసు తెలియదు. బొడ్డు తాడు కూడా ముడివేయలేదు. బోసినవ్వులను చూసి మురిసిపోవాల్సిన వారు కర్కశంగా వదిలేశారు. ఇంకా పూర్తిగా కళ్లు విప్పి లోకాన్ని కూడా చూడని ఆ గంటల వయసున్న చిన్నారిని వదిలించుకోవాలనుకున్నారు. ముళ్లపొదల్లో పడేశారు. అమ్మ పాలు లేక ఆకలితో ఏడ్వడమే ఆ పసికందు ప్రాణాలను కాపాడింది. ఈ అమానవీయ సంఘటన జమ్మలమడుగులో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు, వైద్య సిబ్బంది కథనం మేరకు.. జమ్మలమడుగు పట్టణం ముద్దనూరు రహదారిలోని ముళ్ల పొదల్లో గుర్తు తెలియని వ్యక్తులు ఓ చిన్నారిని వదిలేసి వెళ్లారు. తల్లిపాల కోసం ఏడుస్తున్న ఆ పసికందును గమనించిన స్థానికులు 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి చిన్నారి ఆరోగ్యంగా ఉన్నట్లు నిర్ధారించారు. దీంతో ఆ చిన్నారిని కడపకు తరలించారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రసవం అయిన వారి వివరాలు తెలుసుకునే పనిలో నిమగ్నం అయ్యారు. ఈ చిన్నారిని ఎవరు.. ఎందుకు పడేశారు అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ముక్కుపచ్చలారని చిన్నారిని ఇలా రోడ్డుపాలు చేసిన ఈ అమానుష చర్యపై ప్రతి ఒక్కరూ తీవ్రంగా స్పందించారు.

చిరుద్యోగులపై కూటమి నేతల కక్ష సాధింపు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : చాలా ఏళ్లగా సంఘమిత్రలుగా పని చేస్తున్న చిరుద్యోగులపై కూటమి నాయకులు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. ఇందులో భాగంగా బి.కొత్తకోట మండలానికి చెందిన పలువురు సంఘ మిత్రలను తొలగించడం వివాదానికి దారి తీసింది. బి.కొత్తకోట మండలానికి చెందిన సంఘమిత్రలు లక్ష్మినరసమ్మ, ఈశ్వరమ్మ, భారతిలను స్థానిక కూటమి నాయకులు తంబళ్లపల్లె టీడీపీ నేత దాసరపల్లి జయచంద్రారెడ్డిపై ఒత్తిడి చేసి తొలగించారు. ఈ విషయం తెలుసుకున్న సంఘమిత్రలు, పలువురు మహిళా సభ్యులు బుధవారం ములకలచెరువుకు వచ్చారు. సుమారుగా 50 మంది మహిళలు జయచంద్రారెడ్డి నివాసం వద్దకు చేరుకొని ముట్టడించారు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తమని ఏ కారణంతో తొలగించారో చెప్పాలని నిలదీశారు. ఆగ్రహించిన జయచంద్రారెడ్డి మీరు వైఎస్సార్‌సీపీకి పని చేశారు.. కూటమి ప్రభుత్వానికి ఓట్లు వేయించలేదు.. ఒక్కసారి తొలగించాక చేర్చుకునేదిలేదని వారిపై ఊగిపోయారు. మహిళలు జయచంద్రారెడ్డితో వాగ్వాదానికి దిగారు. తమను విధుల్లోకి తీసుకోకుంటే ఉద్యమం చేస్తామని హెచ్చరించి వెళ్లారు.

దొంగకు దేహశుద్ధి చేసిన గ్రామస్తులు



దొంగను కట్టేసిన గ్రామస్తులు

గుర్రంకొండ : ఇళ్లు, దుకాణాల్లో చోరీలకు పాల్పడిన దొంగకు గ్రామస్తులు దేహశుద్ధి చేసి స్థానిక పోలీస్ స్టేషన్లో అప్పగించిన సంఘటన మండల కేంద్రమైన గుర్రంకొండలో జరిగింది. పెద్దమండ్యం మండలం కలిచెర్ల వడ్డిపల్లెకు చెందిన రెడ్డెప్ప అనే వ్యక్తి కొత్తపేట, పోలేరమ్మవీధిలో పలుచోట్ల గతంలో చోరీలకు పాల్పడ్డాడు. ఇదే వ్యక్తి గతంలోనూ లిటిల్ ఫ్లవర్‌స్కూల్ వద్ద ఓ ఇంట్లో స్పోర్ట్స్ సైకిల్ చోరీ చేశాడు. సింగిల్‌విండో కార్యాలయం వద్ద రాజు అనే వ్యక్తికి చెందిన లేత్‌మిషన్‌లో పలు పరికరాలను చోరీ చేసుకెళ్లాడు. ఈ విషయాన్ని సదరు దుకాణాల యజమానులు సీసీ పుటేజిల ద్వారా గ్రహించారు. గురువారం ఇదే వ్యక్తి మళ్లీ కొత్తపేటలో సంచరిస్తూ ఓ ఇంట్లో చోరీకి పాల్పడుతుండగా గ్రామస్తులు పట్టుకొన్నారు. బాగా దేహశుద్ధి చేసి పోలేమ్మవీధిలోని ఓ దుకాణం వద్ద కట్టి పడేశారు. గతంలో చేసిన చోరీలను అడిగి తెలుసుకొని పూర్తి వివరాలు సేకరించారు. అనంతరం గ్రామస్తులు దొంగను స్థానిక పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మండల సర్వేయర్‌పై కడప ఆర్డీఓ ఆగ్రహం



బాధితులతో మాట్లాడుతున్న కడప ఆర్డీఓ

ఒంటిమిట్ట : ప్రభుత్వం తమకు కేటాయించిన భూములను చూపించాలని బాధితులు ఆర్డీఓకు వినతిపత్రం సమర్పించగా అందుకు సంబంధించిన భూములు ఇంతవరకు ఎందుకు చూపించ లేదు, ఆ భూములు ఎక్కడ ఉన్నాయని మండల సర్వేయర్ ప్రియాంకపై ఆర్డీఓ జాన్ ఇర్విన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మండల పరిధిలోని పెన్న పేరూరు గ్రామంలో తహసీల్దార్ వెంకటరమణ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్, రాజంపేట నియోజకవర్గం టీడీపీ నాయకుడు సుగవాసి బాలసుబ్రమణ్యం హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో తమ భూములు తమకు చూపించాలంటూ బాధితులు కోరగా దీంతో వారు సర్వేయర్ ప్రియాంకను వారి భూములు మ్యాప్‌లో ఎక్కడ ఉన్నాయని ప్రశ్నించారు. ప్రియాంక తడబడటంతో మీ ప్రాంతంలోని భూములు ఎక్కడ ఉన్నాయో మీకే తెలియకపోతే ఏం పని చేస్తున్నారని ఆర్డీఓ సర్వేయర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల సమక్షంలో సదస్సును నిర్వహించేటప్పుడు పూర్తి సమాచారంతో సదస్సుకు హాజరు కావాలన్నారు. అనంతరం సోమశిల వెనుక జలాలతో పెన్నపేరూరులో ముంపునకు గురవుతున్న తమ ఇళ్లకు పరిహారం ఇప్పించాలని ఆర్డీఓకు గ్రామ ప్రజలు విన్నవించుకున్నారు. ఇందుకు స్పందించిన ఆర్డీఓ ముంపు ప్రాంతాన్ని పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట రెవెన్యూ ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్లు, మండల స్పెషల్ ఆఫీసర్ బ్రహ్మయ్య, మండల తహసీల్దార్ రమణమ్మ, ఇతర రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మో.. కొండ చిలువ



రహదారిలో ఉన్న కొండ చిలువ

సిద్దవటం : మండల కేంద్రమైన సిద్దవటంలో గురువారం కొండ చిలువను చూసిన జనం హడలెత్తిపోయారు దిగువపేట గాండ్లపాలెం వెళ్లే రహదారిలో గురువారం రాత్రి కుమ్మరికుంటలో నుంచి కొండచిలువ రహదారిపైకి వచ్చింది. అక్కడి నుంచి పొలాల్లోకి వెళుతుండగా వాహనదారుల కంట పడింది. దీంతో ఆ మార్గాన వెళ్లే వారంతా భయభ్రాంతులయ్యారు.

అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

నిరసన ప్రదర్శనలో ప్రజాసంఘాల నేతలు



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేస్తున్న ప్రజా సంఘాల నేతలు

రాయచోటి అర్బన్ : రాజ్యసభలో జరిగిన చర్చలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌ను కించపరిచేలా మాట్లాడిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా వెంటనే భారత జాతికి క్షమాపణలు చెప్పాలని ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. అంబేడ్కర్‌పై వ్యాఖ్యలను నిరసిస్తూ గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రజాసంఘాల నేతలు నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగ రూపశిల్పి అయిన అంబేడ్కర్ గురించి అమిత్‌షా వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. ఈ వ్యాఖ్యల ద్వారా అమిత్‌షా తన మనువాద దృక్పథాన్ని బయటపెట్టారన్నారు. కోట్లాది దళిత, బడుగు, బలహీన వర్గాల ప్రజల ఆత్మగౌరవానికి అంబేడ్కర్ ప్రతీక అన్నారు. ఆయనను అవమానిస్తే దేశ ప్రజలను అవమానించేనట్లే అన్నారు. అమిత్‌షాకు హోం మంత్రిగా కొనసాగే హక్కులేదని తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అమిత్‌షా వ్యాఖ్యలను ప్రజాతంత్రవాదులు, మేధావులు, లౌకిక, సామాజిక వాదులంతా ఖండించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, ఎంఆర్‌పీఎస్ నాయకుడు రామాంజులు, గిరిజన సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి విశ్వనాథనాయక్, బాస్ రాష్ట్ర కార్యదర్శి పలం తాతయ్య, పౌరహక్కుల సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డెయ్య, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి సుధీర్‌కుమార్, ఎల్‌హెచ్‌పీఎస్ నాయకుడు శంకర్ నాయక్, ఏఐఎస్ఎఫ్ నాయకుడు కోటేశ్వరరావ తదితరులు పాల్గొన్నారు.